నమస్తే తెలంగాణ
రాజన్న సిరిసిల్ల
10 | కరీంనగర్, శుక్రవారం 20 జూన్ 2025 | RAJANNA SIRCILLA

# మద్యం మత్తు.. బైక్‌కు నిప్పు


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

మల్యాల, జూన్ 19 : మద్యం మత్తులో బైక్ నడపడమేకాదు, రోడ్డు మధ్యలో మొరాయించడంతో ఆ బైక్‌కే నిప్పు పెట్టాడు. ఎంతకూ స్టార్ట్ కాలేదన్న కోపంతో ఇలా చేశాడు. మల్యాల పోలీసుల వివరాల ప్రకారం.. జగిత్యాల మున్సిపాలిటీ పరిధిలోని తారకరామానగర్‌కు చెందిన ఖలీమ్ తన బైక్‌పై జిల్లాకేంద్రం నుంచి టీఆర్ నగర్‌వైపు వెళ్తున్నాడు. మార్గమధ్యలో జగిత్యాల- కరీంనగర్ ప్రధాన రహదారిపై ఉన్న రాజారాం గ్రామశివారులోకి రాగానే బైక్ ఆగిపోయింది. అయితే మద్యం మత్తులో ఉన్న ఆయన, బండిని స్టార్ట్ చేసేందుకు ఎంత ప్రయత్నించినా స్టార్ట్ కాలేదు. దీంతో విసుగు చెంది బండికే నిప్పు పెట్టాడు. బైక్‌కు మంటలు అంటుకోవడంతో గమనించిన స్థానికులు 100 డయల్ ద్వారా పోలీసులకు తెలిపారు. వెంటనే బ్లూకోల్ట్ సిబ్బంది సురేశ్, నర్సింగరావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి, 101 ద్వారా జగిత్యాల అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. వెంటనే ఫైర్‌స్టేషన్ సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

# రైతుభరోసా ₹15 వేలని.. ఇచ్చేది ₹12 వేలా..?

- మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి

కథలాపూర్, జూన్ 19 : రైతుభరోసా కింద ఏడాదికి ₹15 వేలు ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి ఇప్పుడు ఎకరానికి ₹12 వేలే ఇస్తారా..? అని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి మండిపడ్డారు. స్థానికల సంస్థల ఎన్నికల్లో రైతులను మోసం చేసేందుకే సర్కారు ఇలా చేస్తున్నదని ధ్వజమెత్తారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బోనస్ అని చెప్పి వానకాలం, యాసంగిలో ఎగనామం పెట్టారని విమర్శించారు. మాయమాటలు నమ్మి ప్రజలు ఒక సారే మోసపోతారని, పదే పదే మోసం చేయాలనుకోవడం అత్యాశ అని అన్నారు. చైతన్యవంతమైన ఈ తెలంగాణ ప్రజలు మీ కుట్రలకు, మీ మోసాలకు కచ్చితంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు.



చెక్‌డ్యాంకు మరమ్మతులు చేపట్టక పోపడంతో వృథాగా పోతున్న వర్షపు నీరు (ఫైల్)



కూలక ముందు వర్షపు నీటి జలకళతో నిండుకుండలా చెక్‌డ్యాం (ఫైల్)

# చెక్‌డ్యాం ఇలా.. నీరు ఒడిసిపట్టేదెలా..?

- నెహ్రూనగర్ వద్ద కూలిపోయిన కట్టడం
- వానకాలం వచ్చినా మరమ్మతులు కరువు
- వృథాగా పోతున్న నీరు
- ఆందోళనలో అన్నదాతలు

రాజన్న సిరిసిల్ల, జూన్ 19 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ సర్కారు పాలనను గాలికొదిలేసింది. సాగునీటి నిర్వహణను మరిచింది. వ్యవసాయానికి సంబంధించి ప్రతి విషయంలోనూ నిర్లక్ష్యం చేస్తున్నది. ఒకనాడు తీవ్ర కరువు, దుర్భిక్షంతో కొట్టుమిట్టాడిన మెట్టను బీఆర్ఎస్ పాలనలో కాళేశ్వర జలాలు సుభిక్షం చేయగా, మధ్యమానేరు ప్రాజెక్టుతో ఈ ప్రాంతంలో కరువు తీరింది. ఇంకా వానకాలంలో వాగుల్లో పారే నీటిని ఒడిసి పట్టి భూగర్భ జలాలు పెంచేందుకు అటు గంభీరావుపేట మండలం నర్మాల నుంచి, ఇటు కోనరావుపేట మండలం నిమ్మపల్లి నుంచి మధ్యమానేరు దాకా ప్రవహించే మానేరు, మూలవాగుపై ₹200 కోట్లతో 12 చెక్ డ్యాంలు నిర్మించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయగా, ప్రస్తుత ప్రభుత్వం ఎండబెట్టే ప్రమాదం కనిపిస్తున్నది. గతేడాది భారీ వరదకు సిరిసిల్ల నెహ్రూనగర్ ఓ చెక్‌డ్యాం కూలిపోయి నీరు వృథాగా పోతున్నా పట్టనట్టు వ్యవహరిస్తున్నది. ఈ యేడు వానకాలం వచ్చినా మరమ్మతులు చేయకుండా చోద్యం చూస్తుండగా, ఈ సీజన్ ఎండుడేనా..? అని పరీవాహక రైతాంగం ఆందోళన చెందుతున్నది. ఇప్పటికైనా నీటి పారుదల శాఖ యంత్రాంగం స్పందించాలని కోరుతున్నది.




రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయం వెనుకాల స్క్రాప్‌గా మారిన వాహనాలు, డంపర్‌బిన్‌లు

# వాహనాలు తుక్కు.. తుక్కు!

- కొనుగోళ్లపై రామగుండం బల్దియా ఎనలేని శ్రద్ధ.. వినియోగంపై అశ్రద్ధ
- స్క్రాప్‌గా మారుతున్నా పట్టని యంత్రాంగం


తుప్పుపడుతున్న వాహనాలు

కోల్‌సిటీ, జూన్ 19 : రామగుండం బల్దియా ప్రజాధనం వృథా చేస్తున్నది. పారిశుధ్య నిర్వహణ కోసం ఇష్టారాజ్యంగా ఆటో ట్రాలీలు, డస్ట్‌బిన్‌లు, ట్రాక్టర్లు కొంటూ, వినియోగంపై తీవ్ర అశ్రద్ధ చేస్తున్నది. కొంత పాతవి కాగానే పక్కకు పడేసి, మళ్లీ కొత్తవి కొనుక్కుంటూ పోతున్నది. వాహనాల వినియోగంలో కావాలనే నిర్లక్ష్యం చేయడం వల్లే కొన్ని కొద్ది కాలానికే స్క్రాప్‌గా మారిపోతూ, కార్యాలయం వెనుకాలే తుప్పుపట్టిపోతున్నాయి. కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్ విభాగం అధికారులు కుమ్మక్కయి పట్టణ ప్రగతి, 14వ ఆర్థిక సంఘం, సాధారణ నిధులను దుబారా చేస్తున్నారనే ఆరోపణలు వస్తుండగా, ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. కాగా, విషయమై ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామన్‌ను వివరణ కోరగా, వాహనాల వినియోగంలో ఎలాంటి నిర్లక్ష్యం లేదని, వర్షాలు, ఇతర సాంకేతిక కారణాలతో వాటి కండిషన్ దెబ్బతినడం వల్లే పక్కకు పెట్టినట్టు చెప్పారు. తుప్పుపట్టిన వాహనాల వేలం కోసం టెండర్లు పిలిచామని, త్వరలోనే వాటిని విక్రయించి కార్పొరేషన్‌కు ఆదాయం సమకూర్చేందుకే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# 28న మెగా జాబ్ మేళా



మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

- నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి
- 18 నెలల కాంగ్రెస్ పాలనలో దిగజారిన ఆర్థిక పరిస్థితి
- డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి
- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల
- కోరుట్లలో జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణ

కోరుట్ల, జూన్ 19 : కోరుట్లలో ఈ నెల 28న నిర్వహించే మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పిలుపునిచ్చారు. గురువారం కోరుట్ల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా తన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళా పోస్టర్‌ను బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కట్కం సంగయ్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే ఈ జాబ్ మేళాలో 50 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటున్నారని తెలిపారు. సాఫ్ట్‌వేర్, సర్వీసెస్ కంపెనీలు, ఫైనాన్స్, మేనేజ్‌మెంట్, బిజినెస్, బ్లూ కలర్ జాబ్స్ కంపెనీల్లో సుమారు రెండు వేలకు పైగా ఉద్యోగాలు కల్పిస్తామని, టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్, ఐటీఐ, ఫార్మసీ డిప్లొమా కోర్సులు చదివిన యువతీ యువకులకు అవకాశాలున్నాయని చెప్పారు. ఇంటర్వ్యూల కోసం ముందుగానే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. నియోజకవర్గ యువతకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే జాబ్ మేళా వివరాల కోసం 7893636313, 9948335533 సెల్ నంబర్‌లో సంప్రదించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఐటీ రంగం ఎంతో పురోభివృద్ధి సాధించిందని చెప్పారు. అంతర్జాతీయ కంపెనీలు హైదరాబాద్‌కు క్యూ కట్టిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు.

## కాంగ్రెస్ పాలనలో దిగజారిన ఆర్థిక పరిస్థితి

కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారిపోయిందని, ఆదాయంలో స్థూల ఉత్పత్తిలో అట్టడుగు స్థాయికి చేరిందని ఎమ్మెల్యే ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి అవగాహనారాహిత్యంతో మాట్లాడుతున్నారని, ఆయనవన్నీ డైవర్షన్ పాలిటిక్సేనని మండిపడ్డారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును తిట్టడమే పనిగా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిపోయిందని, అందాల పోటీలు నిర్వహించి నవ్వులపాలైందన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ వరి నాట్లకు ముందు రైతుబంధు, పెట్టుబడి సాయం అందిస్తే, సీఎం రేవంత్ రెడ్డి ఓట్లకు ముందు పబ్లిసిటీ కోసం రైతు భరోసా తెరపైకి తెచ్చాడని ఆరోపించారు. ఏపీలో నిర్మిస్తున్న బనకచర్లపైనే కాకుండా, తెలంగాణలో ఉన్న దేవాదుల ప్రాజెక్టు పైనా సీఎంకు అవగాహన లేకపోవడం ఆయన బాధ్యతా రహిత పాలనకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చీటి వెంకటరావు, మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, నాయకులు భాస్కర్ రెడ్డి మోహన్ రెడ్డి, మురళి, అతిక్, నగేష్, గంగాధర్, సురేందర్, సంతోష్, నవీన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# సివిల్స్ ప్రవేశ పరీక్షలకు ఉచిత శిక్షణ

కరీంనగర్ కలెక్టరేట్, జూన్ 19 : యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే 2026 సివిల్ సర్వీసెస్ ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు కరీంనగర్ జిల్లా గిరిజనాభివృద్ధి శాఖ అధికారి కే సంగీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో ఎస్టీ, ఎస్సీ, బీసీ అభ్యర్థులకు మాత్రమే రెసిడెన్షియల్ పద్ధతిలో ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ శిక్షణ ఇస్తామని అర్హులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థుల వార్షికాదాయం ₹3 లక్షలకు మించకూడదని, జూలై 7 వరకు http ://studycircle. cgg.gov.in, http G //twd.telan gana.gov.in వెబ్‌సైట్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. ఆబ్జెక్టివ్ టైపు అప్టిట్యూడ్ పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాల కోసం 6281766534 అనే నెంబర్‌లో అన్ని పనిదినాల్లో ఉదయం పదిన్నర గంటల నుంచి సాయంత్రం ఐదు గంటలలోగా సంప్రదించవచ్చని సూచించారు.


వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు పుట్టమధు, కోరుకంటి చందర్

# జీడీనగర్‌లో వాలీబాల్ పోటీలు ప్రారంభం

పాలకుర్తి, జూన్19: పాలకుర్తి మండలం బసంత్‌నగర్‌కు చెందిన ఐఏఎస్ పరికిపండ్ల నరహరి తన తండ్రి సత్యనారాయణ స్మారకార్థం నిర్వహిస్తున్న ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్ జిల్లాల గ్రామీణ వాలీబాల్ పోటీలు జీడీనగర్‌లో గురువారం ప్రారంభమయ్యాయి. మాజీ జడ్పీ చైర్మన్ పుట్టమధు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటిచందర్‌తో కలిసి ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఐఏఎస్ నరహరి కుటుంబం ఆలయ ఫౌండేషన్ పేరుతో పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇక్కడ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కౌశికహరి, దాసరి ఉష, పౌండేషన్ సీఈవో రమేశ్‌బాబు, ఏసీఈవో రాజేంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఆ నాలుగూళ్లకు లైన్‌మెన్లే లేరు

- ప్రైవేట్ వ్యక్తులతోనే పనులు
- అవస్థలు పడుతున్న ప్రజలు


దుర్శేడ్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తున్న ప్రైవేట్ వ్యక్తి

కరీంనగర్ రూరల్, జూన్ 19 : కరీంనగర్ రూరల్ మండలంలోని మందులపల్లి, చేగుర్తితో పాటు ఇటీవల కరీంనగర్‌లో విలీనమైన దుర్శేడ్, గోపాల్‌పూర్‌లో రెండేళ్లుగా విద్యుత్ లైన్‌మెన్ లేక ప్రజలు కష్టాలు పడుతున్నారు. ప్రైవేటు వ్యక్తులతోనే పనులు చేయిస్తూ కాలం వెల్లదీస్తున్నారు. ఎక్కడైనా ఏదైనా సమస్య తలెత్తి కరెంటు పోతే ఇక అంతే సంగతి అని, కరెంటు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి ఉంటుందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. రెండేళ్ల కిందట దుర్శేడ్ విద్యుత్ లైన్ మెన్‌గా పని చేసిన మారుతి సస్పెండ్ అయ్యాడు. అప్పటి నుంచి గ్రామానికి లైన్ మెన్‌లేరు. మిగతా గ్రామాల్లోనూ అదే పరిస్థితి ఉంది. కాగా, దుర్శేడ్‌లో గురువారం ఉదయం 6 గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోగా, సాయంత్రం వరకు కూడా రాలేదు. కరెంట్ కోసం ఎవరిని అడగాలో తెలియక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జూనియర్ లైన్‌మెన్ దుర్శేడ్ హెడ్ క్వార్టర్‌లో అందుబాటులో ఉండడం లేదని, సంబంధిత అధికారులు స్పందించడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

# కాంగ్రెస్ ఎన్నికల హామీ గాలికి.. 'చేయూత'కు మొండిచేయేనా..?



- బీఆర్ఎస్ సర్కారు ఇచ్చిన సాయమే కొనసాగింపు
- పింఛన్ పెరుగుదల ఉత్తమాటే
- అధికారంలోకి వచ్చిఏడాదిన్నర గడిచినా ముందుకు పడని అడుగు
- కొత్త పెన్షన్లకూ మోక్షం లేదు
- వృద్ధులు, దివ్యాంగుల్లో నైరాశ్యం

రాష్ట్రంలో ప్రజా సంక్షేమం గాడి తప్పుతున్నది. ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ సర్కారు విఫలమవుతున్నది. ఎన్నికల ముందు వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు చేయూత పథకం కింద పింఛన్ రెండింతలు చేస్తాం.. ఇంట్లో ఇద్దరికి అందిస్తామని నమ్మించి గద్దెనెక్కి, అమలుకు వచ్చేసరికి చేతులెత్తేస్తున్నది. అసహాయులకు అడుగడుగునా రిక్తహస్తమే చూపుతూ, బీఆర్ఎస్ సర్కారు హయాంలో ఇచ్చిన పింఛన్లనే కొనసాగిస్తున్నది. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నరదాటిపోయినా సాయం పెంచక, కొత్త పింఛన్లకూ అవకాశం ఇవ్వకపోవడంతో వృద్ధులు, దివ్యాంగుల్లో నైరాశ్యం నెలకొన్నది. ప్రభుత్వం స్పందించి, సాయాన్ని పెంచాలని, అర్హులకు కొత్త పింఛన్లు మంజూరు చేయాలనే డిమాండ్ వినిపిస్తున్నది.

కరీంనగర్ కలెక్టరేట్, జూన్ 19 : అధికారమే ధ్యేయంగా అలవికాని హామీలిచ్చిన కాంగ్రెస్ పార్టీ వాటిని అమలు చేయకుండా తప్పించుకునే ధోరణి ప్రదర్శిస్తున్నదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారంలోకి వస్తే వృద్ధులు, ఒంటరి మహిళలు, అసహాయులకు పెన్షన్ రెట్టింపు చేసి రూ.4,016, దివ్యాంగులకు రూ.6,016 చొప్పున ప్రతి ఇంట్లో అర్హులైన ఇద్దరికీ అందజేస్తామంటూ ప్రకటించి, ఇప్పుడు విస్మరించడంపై ఆయావర్గాల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. పెన్షన్ రెండింతలు పెంచుతామంటూ మెనిఫెస్టో ద్వారా ప్రకటించడంతో ఆశపడి మద్దతిస్తే, ఏడాదిన్నర గడుస్తున్నా స్పందన లేదని వాపోతున్నారు. తమను మభ్యపెట్టి ఓట్లేయించుకున్న స్థానిక నాయకులను ప్రశ్నిస్తే, మొండిచేయి చూపుతున్నారంటూ ధ్వజమెత్తుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వ పాలన విధానాన్ని గమనిస్తే గత బీఆర్ఎస్ ప్రభుత్వమే తమకు ఎంతగానో సాయమందించిందనే అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

## బీఆర్ఎస్ ఇచ్చిన పింఛనే కొనసాగింపు..

తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ హయాంలో రాష్ట్రం సంక్షేమంలో దేశంలోనే అగ్రగామిగా వెలుగొందిందనేది నిర్వివాదాంశం. పెన్షన్ల పంపిణీలో దేశంలోని అన్ని రాష్ట్రాలు కూడా తెలంగాణను ఆదర్శంగా తీసుకున్నాయనేది అక్షరసత్యం. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టడంతో, దశాబ్దకాలం పాటు ఎలాంటి సమస్యల్లేకుండా వీరంతా తమ కుటుంబాలను నెట్టుకొచ్చారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన అనంతరం కూడా పింఛన్లను మరో వెయ్యి పెన్షన్ పెంచి, అమలు చేసింది. గతంలో 65 ఏళ్లున్న వారికి మాత్రమే మంజూరయ్యే వృద్ధాప్య పెన్షన్ 57 ఏండ్లకు కుదించి, అమలు చేసింది. వృద్ధులు, ఒంటరి మహిళలు, అసహాయులకు నెలకు రూ.2016, దివ్యాంగులకు రూ.3016 ఇచ్చింది. అయితే గత ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్ రెట్టింపు చేసి రూ.4016, దివ్యాంగులకు రూ.6016 చొప్పున ప్రతి ఇంట్లో అర్హులైన ఇద్దరికీ అందజేస్తామంటూ ఎన్నికల ముదు ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చాక కూడా చేతులెత్తేసింది. గత ప్రభుత్వం పంపిణీ చేసిన మొత్తాన్ని మాత్రమే ఇప్పటికీ కొనసాగిస్తోంది. కరీంనగర్ జిల్లాలో ప్రస్తుతం 1,35,881 మంది వివిధ రకాల పెన్షన్లు పొందుతుండగా, వీరిలో 53,791 మంది వృద్ధులు, 37,221 మంది వితంతువులు, 2,706 మంది చేనేత, 3,680 మంది గీత, 9,546 మంది బీడీ కార్మికులు, 3,427 మంది ఒంటరి మహిళలు, 54 మంది బీడీ టేకేదార్లు, 2003 మంది ఏఆర్టీ, 538 మంది ఫైలేరియా, 118 మంది డయాలసిస్ పేషంట్లు, 22,797 మంది దివ్యాంగులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించిన పెన్షన్ మాత్రమే అందుతున్నది.



## కొత్త పింఛన్లకు మంగళం

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే పెన్షన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానించగా, జిల్లాలో వేలాది మంది అర్జీ పెట్టుకున్నారు. వాటిని పరిశీలించిన జాడ లేదు. కొత్త పెన్షన్ల మంజూరుకు మోక్షం కల్పించలేదు. గతంలో ఇంటిలో పెన్షన్‌దారు మరణిస్తే ఆ పెన్షన్‌ను భార్యకు గానీ, భర్తకు గానీ మళ్లించి కొనసాగించేవారు. ప్రస్తుతం స్పౌజ్ పెన్షన్‌లకు కూడా అవకాశం లేక ఇబ్బందులు పడుతున్నామని పలువురు వాపోతున్నారు.

# మనీశ్‌ను బతికించండి..

- నిరుపేద మూడేళ్ల బాలుడికి పెద్ద కష్టం
- జాండీస్‌తో దెబ్బతిన్న లివర్
- లివర్ ప్లాంటేషన్ చికిత్సకు ₹25 లక్షలు
- మానవతామూర్తులు ఆదుకోవాలని కుటుంబ సభ్యుల వేడుకోలు


చికిత్స పొందుతున్న బాలుడు మనీశ్

సిరిసిల్ల టౌన్, జూన్ 19 : మూడేళ్ల బాలుడు లివర్ సంబంధిత వ్యాధితో దవాఖానకు పరిమితమయ్యాడు. ఆడుకోవాల్సిన వయసులో అపస్మారస్థితికి చేరుకున్నాడు. ధీన స్థితిలో ఉన్న కొడుకును చూస్తూ ఆ పేద తల్లిదండ్రులు 'దేవుడా నువ్వే మా కొడుకును కాపాడాలి' అంటూ తల్లడిల్లుతున్నారు. మానవతామూర్తులు ఎవరైనా ముందుకు వచ్చి తన కొడుకు వైద్యానికి సాయం అందించాలని వేడుకుంటున్నాడు. పూర్తి వివరాలిలా ఉన్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీవైనగర్‌కు చెందిన గూడూరి రాజశేఖర్-సంజన దంపతులకు మూడేళ్ల కొడుకు మనీశ్ ఉన్నాడు. కొద్ది రోజుల క్రితం అతడు అస్వస్థతకు గురవడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షలు చేసిన తర్వాత పచ్చ కామెర్లు(జాండీస్) అయ్యాయని, లివర్ పూర్తిగా డ్యామేజ్ అయినట్లు తెలిపారు. చిన్నారి ఆరోగ్యంగా ఉండాలంటే లివర్ ప్లాంటేషన్ తప్పనిసరి అని చెప్పారు. దీని కోసం ₹25 లక్షల వరకు ఖర్చవుతాయని చెప్పారు. ఓ ఏజెన్సీలో నెలసరి జీతంతో పని చేస్తున్న రాజశేఖర్ కుటుంబాన్ని పోషించుకోవడమే కష్టంగా మారగా, తన కొడుకుకు ఇంత ఖరీదైన వైద్యం చేయించలేని స్థితిలో ఉన్నాడు. ఇప్పటికే దాదాపు ₹4 లక్షల వరకు అప్పులు చేసి వైద్యం చేయించాడు. మనీశ్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. మానవతా దృక్పథంతో ఎవరైనా మానవతామూర్తులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి తన కొడుకు వైద్యానికి సాయం అందించాలని మనీశ్ తల్లిదండ్రులు వేడుకుంటున్నాడు. సాయం చేయాలనుకునే వారు మొబైల్ నంబర్ 9441161257కు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా అందించాలని విజ్ఞప్తి చేస్తున్నాడు.